# స్పర్శ

**నేను వెళ్లేసరికి నవారు మంచం మీద గోడవైపు తిరిగి పడుకుని ఉన్నారు నాన్నగారు.**

చెప్పులు వీధి గుమ్మంలోనే విడిచి వెళ్లానేమో, నేను వచ్చినట్లు ఏ విధమైన శబ్దమూ కాలేదు. మంచం దగ్గరగా వెళ్లి, 'పడుకున్నారా?' అన్నాను.

'ఎవరూ?' అంటూ ఇటువైపుకి ఒత్తిగిల్లారు.

'నేనే' అన్నాను.

'రా, ఇలా కూర్చో' అన్నారు పడుకునే. నేను అక్కడున్న ఒక స్టీలు కుర్చీ కొంచెం పక్కకి లాగి కూర్చోబోతూంటే ఆ చప్పుడు విని, 'అంత దూరంలో ఎందుకు? ఇలావచ్చి కూర్చోవమ్మా' అంటూ, మంచం మీద తను లేచి కూర్చుని, నాకు తన పక్కన చోటు చూపించారు చేత్తో మంచం మీద తట్టుతూ.

నేను వెళ్లి మంచం పట్టీ మీద కూర్చున్నాను.

నాన్నగారు చేత్తో తడుముతూ నా వీపు మీద చెయ్యివేసి, తన పక్కన మంచం మీద తడిమి, 'సరిగ్గా కూర్చోమ్మా' అన్నారు.

నేను కొంచెం వెనక్కి జరిగి సర్దుకున్నాను.

ఆయన చేత్తో తడుముతూ, నా చెయ్యి అందుకుని తన చేతుల మధ్య పెట్టుకుని, 'నువ్వొస్తావని రోజూ ఎదురు చూస్తున్నాను. అంతా కులాసాగా ఉన్నారా?' అన్నారు.

'ఊఁ' అన్నాను సన్నగా.

ఆయన ఇంకేమీ మాట్లాడకుండా నా చెయ్యి నిమురుతూ నిశ్శబ్దంగా ఉండి పోయారు.

ఇది వరకోసారి - అంటే , నేను యుక్త వయస్సులో ఉన్నప్పుడు - నాన్నగారూ, నేనూ ఒకే రిక్షాలో వెళ్లవలసి వచ్చింది ఎక్కడికో. రిక్షా విశాలంగా ఉన్నా, నేను ఒక వైపుకి బాగా ఒదిగి కూర్చున్నాను.

'సరిగ్గా కూర్చోమ్మా పడిపోతావు' అన్నారు నాన్నగారు.

నేను మొహమాట పడుతూ ఒక అంగుళం ఆయన వైపుకి జరిగాను.

నాకు అక్షరాభ్యాసం అయినప్పటి నుంచి ఆయన నన్ను క్రమశిక్షణ పేరుతోనూ, మడీ, ఆచారం కారణాల వల్లనూ, చూపులతోనే అల్లంత దూరాన నిలబెట్టి మాట్లాడటం అలవాటయి, ఆయన దగ్గర చనువు తీసుకునే సాహసం హరించుకుపోయింది నాన్నగారిని ఏ సమయంలో చూసినా మడికట్టుకున్నట్లుగానే అనిపించి, నాకు ముడుచుకు పోవడం అలవాటయిపోయింది. అలాంటిది, రిక్షాలో ఆయన్ని అంటుకునేట్లు ఎలా కూర్చోగలను?

స్కూలు నుంచి రాగానే ఆప్యాయంగా దగ్గిరికి తీసుకొని ఆ ప్రశ్నలూ, ఈ ప్రశ్నలూ వేస్తే, స్కూలు కబుర్లన్నీ చిలకలా చెబుతారు పిల్లలు. అంతేకాని, 'లెక్కల్లో మార్కులెన్నొచ్చాయి?' అనో, లేదా 'మార్క్సు షీటు పట్టుకొచ్చావా?' అనో గుడ్లురుముతూ వీధి గుమ్మంలోనే నిలదీస్తే పిల్లలు బిక్కచచ్చిపోరూ! అలా బిక్క చచ్చిపోతూనే బతికాను ఇరవై ఏళ్ళు వచ్చేవరకూ. ఆ బెదురు ఇంకా పోలేదు.

నాన్నగారికిప్పుడు ఎనభై దాటాయి. ఆపరేషను చేస్తే కంటి చూపు వచ్చే వయస్సు దాటిపోయింది. తక్కిన విషయాల్లో అనారోగ్యం లేక పోయినా, దృష్టి లోపమే ఆయన్ని బలహీనుణ్ణి చేసింది. మంచం మీదే గడుపుతున్నారు రెండేళ్ళ నుంచీ.

మా అత్తగారికి ఒంట్లో బాగా లేదని తెలిసి, ఇద్దరం సెలవు పెట్టుకుని వచ్చాం - ఆవిడ దగ్గర కొన్నాళ్ళుందామని. నేను ఎలాగో వీలుచేసుకుని అప్పుడప్పుడు అమ్మనీ, నాన్నగారినీ చూడటానికి వెడుతున్నాను ఊళ్లోనే కనుక. వెళ్లినప్పుడల్లా ఓ అరగంట సేపు కూర్చుని ఆయనతో మాట్లాడి వచ్చేస్తున్నాను.

నాన్నగారికి సమీపంగా సన్నిహితంగా కూర్చోవడం అన్నది లీలగా మిగిలిపోయిన బాల్యస్మృతి! ఇప్పుడు ఆయన నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా స్పృశిస్తూంటే నా చిన్నతనం నుంచీ ఆ స్పర్శకోసం నేను అంతరాంతరాల్లో పొందిన తపనంతా కళ్లకు కట్టినట్లై కళ్ల నీళ్లు తిరిగాయి. మాట్లాడాలంటే గొంతు గాద్గదికమైంది. ఆయన ప్రేమ పూరితమైన స్పర్శకోసం ఒకప్పుడు తపించి పోయానన్న సంగతి ఆయన కెప్పుడైనా స్ఫురించి ఉంటుందా?

మా ఇద్దరి మధ్యా ఉత్తరాల్లో ప్రవహించిన ప్రేమ ప్రవాహమంతా మేము ఒకరికొకరం ఎదురుపడినప్పుడు ఆయన గాంభీర్యానికీ, తీక్షణ వీక్షణాలకీ ఆవిరి అయిపోయేదేమో! చిన్నప్పటి నుంచీ సూర్యకిరణాల్లా చురుక్కు మనిపించేటటువంటి ఆయన చూపుల్ని తట్టుకోలేక, భరించలేనట్లు తప్పించుకు తిరగటం అలవాటయిన నేను, ఆయన కళ్లిప్పుడు ఆర్పేసిన దీపాలని తెలిసినా ఎందుకు చనువు తీసుకోలేకపోతున్నాను?

ఊరునుంచి వచ్చిన మొదట్లో ఆయన దగ్గర కూర్చున్నప్పుడు నవారుమంచం పట్టీ మీద

నల్లులు పాకుతూండడం గమనించాను. ఒకటి రెండు చడీచప్పుడు కాకుండా తీసి కాలికిందవేసి నలిపేశాను.

ఆ తరవాత మా ఇంట్లో మంచం మీద ఒక నల్లి కనిపించేసరికి మా వారు అదెలా వచ్చిందని గాభరాపడ్డారు. బహుశా మా నాన్నగారి మంచం దగ్గర కూర్చున్నప్పుడు నా బట్టల్లో దూరి ఏమైనా వచ్చిందేమోనని చెప్పాను. నేను మళ్లీ నాన్నగారిని చూడటానికి బయలుదేరుతుంటే, నాన్నగారి మంచం దగ్గర కూర్చోవద్దనీ, దూరంగా కుర్చీలో కూర్చుని మాట్లాడిరమ్మనీ మావారు హెచ్చరించారు.

నేను కుర్చీని దూరంగా జరిపి కూర్చోబోతూంటే నాన్నగారు నన్ను తనకి దగ్గరగా కూర్చోమన్నారు! ఎలా కాదనడం? ఆయనకు అనుకున్నట్లుగా కూర్చుని ఆయన చేతిలో చెయ్యి వేసే వరకూ ఆయనకు తృప్తికలగలేదు.

మగపిల్లల కోసం జీవితమంతా తపించిన నాన్నగారికి చివరికి ఆడపిల్లలమే మిగిలాం! జీవిత చరమదశలో చెట్టంత వంశోద్ధారకుడు - ఉన్న వాడొక్కడూ పోయాడు. విధిరాత అంటే ఇదేనేమో! అన్నయ్య పోయినప్పుడు నాన్నగారి ఎదుటకి వెళ్లడానికి ఏదో జంకు - ఏదో తప్పు చేసిన భావన వెనక్కిలాగేది. నాన్నగారిని పొదివి పట్టుకుని 'ఏడవద్దు, మీకు నేనున్నాను' అని చెప్పాలనిపించింది. కాని, ఆయన్ని స్పృశించడానికే బెదురు. ఆయన పెంచిన పెంపకం అలాంటిది.

నాన్నగారితో కాస్సేపు కూర్చుని మాట్లాడిన తరవాత, తన చేతి గోళ్లూ, కాలిగోళ్లూ కత్తిరించిపెట్టమన్నారు. రోలొచ్చి మద్దెలతో మొర పెట్టుకున్నట్లు అటువంటి పనులు అమ్మకి చెప్పి లాభంలేదు. అన్నయ్యకి చెప్పడానికి వాడులేడు. వాడిపిల్లలిక్కడ లేరు. వదినకి చెప్పలేక కాదు. నా చేత ఏదో సేవ చేయించుకోవాలన్న తపనతో కావచ్చు - నన్నే అడిగారు. అదే మహాభాగ్యమన్నట్లు మురిసిపోతూ శ్రద్ధగా కత్తిరించాను.

నాన్నగారి మనస్సు బావుండక కాబోలు, నా చెయ్యి నిమురుతూ, 'మీరు ఈ ఊరికి వచ్చేసినా బావుండును, మీ దగ్గరకి వచ్చి ఉండేవాడిని' అన్నారు. నేను నిస్సహాయంగా చూశాను. ఆ చూపులు ఆయనకు కనిపించవు. నా మాటలు ఆయనకు సాంత్వనం కలిగించేటట్లు లేవు.

నాన్నగారు ఇంకేమీ అడక్కుండా నిశ్శబ్దంగా నా చెయ్యి నిమురుతూ కూర్చుండి పోయారు. ఆ క్షణంలో నాకు ఈ విద్య, ఉద్యోగం - అన్నీ అలంకారప్రాయంగా తోచాయి. కాస్సేపు అలాగే కూర్చుని, వెళ్లొస్తానని చెప్పిలేచాను.

రిక్షాలో కూర్చుని తిరిగి వస్తూంటే నాన్నగారి మృదుస్పర్శ నన్ను వెంటాడు తున్నట్లుతోచి, నా కన్నులనిండా నీరు నిండి, మార్గమంతా మసక మసగ్గా కనిపించింది.

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 31-3-89*